క్లుప్తంగా

ఆబోతుకు చికిత్స



గాయపడ్డ ఆబోతుకు వైద్యం చేస్తున్న వెటర్నరీ ఏడీ జనార్దనరావు

ఆకివీడు: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో వెలంపేట వద్ద గాయపడిన ఆబోతుకు పశుసంవర్ధక శాఖ ఏడీ జనార్దనరావు వైద్య చికిత్స అందించారు. వివరాల్లోకి వెళితే.. ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని వెనుకకు నడుపుతుండగా, రోడ్డుపై పడుకున్న ఆబోతు కాలుపైకి టైరు ఎక్కడంతో తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు సపర్యలు చేసి, పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. ఏడీ జనార్దనరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆబోతు కాలుకు మందు వేసి కట్టుకట్టారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

'నాచు' మృతికి మోషేన్‌రాజు నివాళి



సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న మోషేన్‌రాజు

భీమవరం (ప్రకాశం చౌక్): సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాచు సత్యనారాయణ (సత్యం) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందడంతో ఆయన భౌతికకాయాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఆదివారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని మోషేన్‌రాజు గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి తీవ్ర సంతాపం తెలిపారు.

నిమ్మల కుటుంబానికి పీవీఎల్ పరామర్శ



శ్రీను చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీవీఎల్

ఆకివీడు: పార్టీకి ఎనలేని సేవలందించి, పిన్న వయస్సులోనే అకాల మరణం పొందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మల శ్రీనివాసరావు లేని లోటు గ్రామంలో పార్టీకి తీరనిదని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం నిమ్మల కుటుంబాన్ని పరామర్శించి, శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, పుప్పాల పండు, కొట్టు మాణిక్యాలరావు, కుర్రెళ్ల పాలు, కోయ అయ్యన్న, తవిటినాయుడు తదితరులు సంతాపం ప్రకటించారు.

ప్రారంభమైన సార్వా వరి నాట్లు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో సార్వా వరినాట్లు ప్రారంభమయ్యాయి. ముందస్తు సార్వా సాగుకు సన్నాహాలు చేయాలని వ్యవసాయాధికారులు సూచించడంతో గునుపూడిలో వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, గునుపూడి, అనాకోడేరు, కొమరాడ, రాయలం, చినఅమిరం, నరసింహపురం తదితర గ్రామాలలో సుమారు 8,900 ఎకరాలలో రైతులు సార్వా సాగు చేపట్టారు. ఇప్పటికే పొలాల్లో దమ్ములు, గట్టులంకలు సార్వా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందస్తుగా సార్వా సాగు వల్ల అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చే భారీ వర్షాలు, తుపానుల ధాటికి పంటను రక్షించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెబుతున్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు డీసీఎంఎస్‌లో అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఆర్‌బీకే సెంటర్లలో బుక్ చేసుకోవాలని కోరారు.

యువతి అదృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తోకతిపప గ్రామంలో ఆదివారం ఓ యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని 20 ఏళ్ల వయస్సున్న యువతి ఈ నెల 13న రాత్రి ఇంట్లో నిద్రపోయింది. తెల్లవారిన తరువాత తన కుమార్తె కనిపించకపోవడంతో ఆమె ఆచూకీ కోసం తండ్రి బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో గాలించినా ప్రయోజనం లేకపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

భీమవరం అర్బన్: దెయ్యాలతిప్పలో ఆదివారం ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ప్రకారం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన నాగిడి తాతాజీ భీమవరం వెళుతుండగా రామాయణపురం వచ్చేసరికి అతనిపై మద్యం తాగి ఉన్న మైలపల్లి రాజేష్, రెడ్డి మణికంఠలు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటికీ కుళాయి

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు
- దొడ్డనపూడిలో జలజీవన్ మిషన్ నిధులు రూ. 60 లక్షలతో రెండు మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణానికి భూమిపూజ



దొడ్డనపూడిలో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పీవీఎల్, శ్రీనివాసరాజు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు చెప్పారు. దొడ్డనపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం భూమి పూజ, ప్రారంభోత్సవాలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.60 లక్షలతో నిర్మించనున్న రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు ముఖ్య అతిథులు పీవీఎల్, శ్రీనివాసరాజు భూమిపూజ చేసి ప్రారంభించారు. అదేవిధంగా మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతోగానో కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధి కూడా ప్రభుత్వ హయాంలో జరుగుతుందన్నారు. గ్రామంలో సురక్షితమైన మంచినీళ్లు అందించడమే లక్ష్యంతో జలజీవన్ మెషీన్ ద్వారా రెండు ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం కానుందని అన్నారు. అభివృద్ధిలో పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజాసమస్యలే పరిష్కారంగా సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నియోజవర్గంలో అన్ని గ్రామాలను ఒక్కొక్కటిగా అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. పార్టీలకతీతంగా కులమతాలకతీతంగా సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామంలో మండల పరిషత్, జెడ్పీటీసీ నిధులు రూ.10 లక్షలతో రెండు ప్రాంతాల్లో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని పీవీఎల్‌ను కోరారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని, పూర్తిస్థాయిలో అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు జగన్, వైఎస్సార్ సీపీ నాయకులు గుండా సాయి, కొల్లి రామకృష్ణ, దేవి ప్రసాద్, పార్టీ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు

ఆకివీడు: అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు హామీ ఇచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే అతిథి అధ్యాపకులు ఆదివారం భీమవరంలో మండలి చైర్మన్ మోషేన్‌రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో 890 మంది అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నామని, గత ప్రభుత్వంలో రూ.14,400 వేతనం ఇచ్చేవారని, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ రూ.28 వేలు ఇస్తున్నారన్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలోనే పని చేస్తున్నట్లు వివరించారు. అయితే బోధన జరిగిన సమయాన్ని గంటల ప్రాతిపదికగా లెక్కించి జీతం ఇస్తున్నారని వాపోయారు. అతిథి అధ్యాపకుల్ని కాంట్రాక్టులో విలీనం చేసే విధంగా సహకరించాలని, లేని పక్షంలో ప్రభుత్వం ప్రకటించినట్లుగా రూ.28 వేలు జీతం ఇచ్చేలా సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. వివరాలను అధ్యాపకులు పి.అమూల్యరావు, జి.సంజీవరాజు, పి.పండు ఆదివారం ఆకివీడులో విలేకరులకు వివరాలను వెల్లడించారు.

కోడిపందేలపై దాడి

ఉండి: మహదేవపట్నంలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై ఎస్సై కే గంగాధరరావు, స్పెషల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2,220 నగదు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోలనపల్లిలో..

కాళ్ల: కోలనపల్లిలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 12 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆదివారం చెప్పారు. గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 12 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,900 నగదు, 2 కోళ్లు, 2 కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా అమ్మవార్లకు ఆషాఢ సారె



గొల్లవానితిప్పలో అమ్మవార్లకు సమర్పించిన ఆషాఢ మాస సారె

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప గ్రామ దేవతలు శ్రీ ముత్యాలమ్మ, గరవల్లమ్మ, పర్లమ్మ అమ్మవార్లకు ఆదివారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. తొలుత గుద్దటి వెంకట రామారావు, లక్ష్మి దంపతులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామ సేవా సమితి, శ్రీకోదండ రామాలయ భక్త బృందం ఆధ్వర్యంలో మురళీ కోలాటంతో వైభవంగా భక్తులు అమ్మవార్లకు సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీమావుళ్లమ్మవారి ఆషాఢ మాస జాతర

వీరవాసరం: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని శ్రీమావుళ్లమ్మ, శ్రీమహాలక్ష్మి వారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ మంతెన ప్రసాద్ కోరారు. రాయకుదురులో వేంచేసియున్న శ్రీమావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు స్వామివార్ల ఆషాఢమాస జాతర ఉత్సవాలు సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలందరి పైన అమ్మవారి వారి కరుణా, కటాక్షాలు ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ముందుగా శ్రీ మావుళ్లమ్మ, శ్రీ మహాలక్ష్మి, పోతరాజు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం ఆఖరు ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వలంటీర్ సహకారం మరువలేను



ప్రవీణ్‌కుమార్‌కు పింఛను అందిస్తున్న వలంటీర్ ప్రసాద్

ఉండి: నాపేరు గొర్లి ప్రవీణ్‌కుమార్. శారీరక వైకల్యం వల్ల ఎంతో కుంగుబాటుకు గురయ్యాను. నా కుటుంబానికి ఆర్థికంగా ఆసరా కావాలని ఎన్నో తపన పడుతుండేవాడిని. ఏవీ సఫలం కాలేదు. కనీసం నాకైనా ప్రభుత్వ నుంచి కొంతైనా ఆసరా అందుతుందనే ఆశతో గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు పింఛను కోసం ప్రయత్నించినా మంజూరు కాలేదు. కానీ జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత మా ప్రాంత వలంటీర్ పంపన చంద్రశేఖరప్రసాద్ నాకు సదరం సర్టిఫికెట్ పొందేందుకు ఎంతో సహాయం చేశాడు. అలాగే పింఛన్ కోసం ఆయనే దరఖాస్తు చేయించాడు. దీనివల్ల ఇప్పుడు నేను పింఛన్ పొందుతున్నాను. మా వలంటీర్ సహకారం లేకపోతే నాకు పింఛన్ వచ్చేది కాదు. గతంలో పింఛన్ కొరకు నేను పడని ఇబ్బందిలేదు. కానీ ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ ద్వారా నాలాంటి వాళ్లు ఎంతో మంది సంతోషంగా ఉంటున్నారు. జగనన్న పెట్టిన వలంటీర్ వ్యవస్థ చాలా చాలా బాగుంది. వారి వల్లనే ఎక్కడికీ వెళ్లనవసరం లేకుండా సరిగ్గా ప్రతినెలా ఒకటో తేదీనాటికే ఇంటికి పింఛన్ వచ్చి ఇస్తున్నారు. మాలాంటి వాళ్లు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ఎంత కష్టపడాలో మాకే తెలుసు. కానీ అటువంటి కష్టం మాకు రాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌లను ఏర్పాటు చేయడంతో మా కష్టాలు తీరాయి. సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.

మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న పీవీఎల్

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. నగర పంచాయతీ చీఫ్ విప్, స్థానిక కౌన్సిలర్ పడాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక లాంచీల రేవు సమీపంలో సిద్ధాపురం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలను గుర్తించి సీసీ రోడ్లు, మంచినీటి పైప్‌లైన్ల విస్తరణ, లోఓల్టేజ్ సమస్యల్ని పరిష్కరిస్తున్నామని చెప్పారు. పట్టణంలోని పలు వార్డుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రాంతంతో పాటు దుంపగడప గ్రామంలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి స్థానిక గాలిబ్ చెరువు వద్ద 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నామని, త్వరలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, ఎండీ జక్కీ, నాయకులు జోగి నాగరాజు, షేక్ హుస్సేన్, పడాల కిషోర్ రెడ్డి, తిప్పా దుర్గాభవానీ, శ్రీనివాస్, అందే రాజబాబు, కుర్రెళ్ల పాలు, ఇంటి సత్యనారాయణ, రమణారెడ్డి, ఏపీఈపీడీసీఎల్ ఏఈ ప్రసాదరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో గ్రామాల అభివృద్ధి



రేవు ప్రారంభ కార్యక్రమంలో పీవీఎల్, శ్రీనివాసరాజు తదితరులు

కాళ్ల: గ్రామాల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు అన్నారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ద్వారా దాట్ల వెంకటరామరాజు వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన పద్మావతి కోనేరు చెరువు అభివృద్ధితో పాటు రూ.10 లక్షలతో నాలుగు రేవులను నిర్మించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పీవీఎల్, శ్రీనివాసరాజుల చేతుల మీదుగా వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కాళ్లకూరు గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కోనేరు చెరువు అభివృద్ధి చేయటంతో పాటు స్థానికుల కోసం రేవులను నిర్మించడం అభినందనీయమన్నారు. చెరువు గట్టుపై షెడ్డు నిర్మించి స్థానికుల అవసరాలు తీర్చడం గొప్ప విషయం అని కొనియాడారు. శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న దాట్ల వెంకట రామరాజును అభినందించారు. అంతేకాకుండా ట్రస్ట్ పేరు మీద స్మశానం అభివృద్ధి కూడా చేశారని గుర్తు చేశారు. దాత వెంకటరామరాజును దుశ్శాలువాతో సత్కరించారు. పెద్ద లు డాక్టర్ నీలాద్రిరాజు, పెనుమత్స సోమరాజు, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, ట్రస్ట్ పేరు మీద సేవా కార్యక్రమాలు చేస్తున్న దాతలను అభినందించారు. సర్పంచ్ సాధు శ్రీదేవి, వైద్యులు, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ డీవీ కృష్ణంరాజు, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, కోస్టల్ సోమరాజు, వేగేశ్న విజయరామరాజు, అడ్డాల నాగరాజు, భరత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



కాళ్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



భీమవరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థు

కాళ్ల: కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల నడుమ సాగింది. దేశ, విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు అంతా తమతో చదివిన విద్యార్థులను కలిసేందుకు అందరూ ఒకచోటకు చేరారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. గురు శిష్యుల పవిత్ర బంధం గుర్తుకు తెచ్చుకున్నారు. పాఠశాలకు అవసరమయ్యే విద్యుత్, వైఫై, కుర్చీల ఏర్పాటు నిమిత్తం రూ.60వేలు విరాళం అందించారు. తమతో చదివిన 160 మంది పైబడిన విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్ ద్వారా అందర్నీ కలిపి ఒక వేదిక మీదకి చేరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం శ్రీ జూపూడి గంగయ్య మెమోరియల్ హైస్కూల్‌లో 1985–86 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా కలిసి గురువులను సత్కరించారు. స్కూల్‌కు అవసరమైన క్రీడా సామగ్రి, రూ.10 వేలు స్కూలు అభివృద్ధికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జూపూడి నాగ దమయంతి, ఎం.దేవేంద్రబాబు, జవ్వాది స్వామినాయుడు, సూదాబత్తుల కృష్ణమోహన్, కామన రాంబాబు, కె.తులసీరామ్ (చెన్నయ్), కొండపల్లి భాస్కర్, బాపట్ల కిషోర్, పులపర్తి గోపాలం, ఎ.కాశీ విశాలక్షి, పద్మ (చెన్నయ్) తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో విత్తనమే కీలకం



వేండ్రలో ట్రాక్టర్‌తో చేనును దుక్కుతున్న దృశ్యం



పాలకోడేరు ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న విత్తనాలు

- నాణ్యమైన వంగడాలతోనే అధిక దిగుబడి
- గుర్తింపు సంస్థల నుంచే సేకరణ మేలు
- ప్రకటనలు, దళారుల మాటలు నమ్మవద్దు
- రైతులకు వ్యవసాయ అధికారులు సూచన

పాలకోడేరు: వరి సాగులో విత్తనమే కీలకం. దీనిపైనే పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. మార్కెట్‌లో విత్తనాలు రకరకాల ప్యాకింగుల్లో దర్శనమిస్తుండటంతో ఏది నకిలీ, ఏది మంచిదో తెలియక రైతులు నాసిరకం విత్తనాలు కొని పంట వేసి నష్టపోతున్నారు. విత్తు మంచిదయితే దిగుబడి బాగుంటుంది. విత్తనాలు నాణ్యమైనవి ఎంపిక చేసుకోవడంలో రైతులు శ్రద్ధ చూపించాలి. అలాగే మొలక శాతం చూసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఖరీఫ్ సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

మండలంలో 11,900 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు

ప్రస్తుత ఖరీఫ్ సాగులో మండలంలో 11,900 ఎకరాల విస్తీర్ణంలో రైతులు చేపట్టారు. అధిక శాతం కాలువల కిందే సాగు జరుగుతోంది. డెల్టా ప్రాంతమైన ఉండి నియోజకవర్గంలో పాలకోడేరు, ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కువ దిగుబడినిచ్చే 1318, సంపద, 1061, 1064, 7029 (ఎంటీయూ స్వర్ణ) వంగడాలను అధికంగా పండిస్తున్నారు.

ప్రస్తుత సీజన్లో సాగు చేస్తున్న వరి రకాలు

1318 వరి రకం స్వర్ణ నుంచి రూపొందించబడింది. ఇది 160 రోజుల్లో పంట చేతికొస్తుంది. వర్షాలకు గాలి వానకు తట్టుకుని పైరు పడిపోకుండా నిలబడుతుంది. 35–40 బస్తాల దిగుబడినిస్తుంది. ప్రస్తుతం రైతులు 30 శాతం ఈ రకాన్ని సాగు చేస్తున్నారు.

సంపద వరి రకం

దీన్ని నూజివీడు సీడ్స్ వరి రకంగా పిలుస్తారు. 140 నుంచి 145 రోజుల పంట. ఈ రకం కూడా స్వర్ణ నుంచి రూపొందించబడింది. వర్షాలకు గాలులకు వాలిపోకుండా నిలబడుతుంది. విత్తన మార్పిడి సరి చేసుకోకపోతే విత్తనం పట్టు తప్పుతుంది. దిగుబడి 35 నుంచి 40 బస్తాలు వస్తుంది.

1061 మార్టేరు వరి రకం

దీన్ని సూపర్‌ఫైన్ (తెలుపులు) సన్నబియ్యం అని కూడా పిలుస్తారు. ఇది 145 నుంచి 150 రోజులు పంట. పడిపోకుండా ముంపును తట్టుకుంటుంది. ఈ రకాన్ని 20 శాతం మంది రైతులు సాగు చేస్తున్నారు.

1064, 7029 (ఎంటీయూ స్వర్ణ) ఈ రకాలు మార్టేరు పరిశోధన కేంద్రం తయారు చేసినవి. 145–150 రోజులు పంట కాలం. 35 నుంచి 40 బస్తాలు దిగుబడినిస్తాయి. చేను పడుకోకుండా ఉంటుంది. రైతులు ఈ రకాలను అక్కడక్కడ తక్కువగా సాగు చేస్తున్నారు

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు

ధ్రువీకరించిన మేలురకం విత్తనాలను ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థల నుంచి లేదా పరిశోధనా సంస్థల నుంచి లేదా లైసెన్సు కలిగిన డీలర్ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. గుర్తింపు పొందిన సంస్థల సర్టిఫైడ్ చేసిన విత్తనాలనే కొనాలి. దళారులు చెప్పిన విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టాలు వస్తాయి. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేస్తే ఇబ్బందులు తలెత్తినప్పుడు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. విత్తన మొలక శాతం పరీక్షించుకోవాలి.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో 1061 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 30 కేజీల బస్తా రూ.1,150కు లభిస్తుంది. అలాగే యూరియా, పొటాష్, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వీటిని రైతులకు అందిస్తున్నారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలను సందర్శించి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవచ్చు.

రాయితీపై విత్తనాలు



నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా 20 క్వింటాళ్ల 1061 విత్తనాలను రాయితీపై రైతులకు అందించాం. విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించి నారుమడులు వేయాలి. అధీకృత డీలర్లు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విధిగా డీలర్లు ఇచ్చే బిల్లులను రైతులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. అప్పుడే విత్తనాల కారణంగా పంట నష్టపోతే పరిహారం పొందే వీలుంటుంది.

– వి.నారాయణరావు, మండల వ్యవసాయ అధికారి, పాలకోడేరు